సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 18 । ఆగస్టు । 2025



సిబ్బంది ముగ్గురు.. ఖైదీలు ఐదుగురు

సిబ్బంది ముగ్గురు.. ఖైదీలు ఆరుగురు. ఇది సినిమా టైటిల్ కాదు. ప్రొద్దుటూరు సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలు, విధుల్లో ఉన్న సిబ్బంది సంఖ్య. -8లో



విష జ్వరంతో విద్యార్థి మృతి

వేంపల్లె పట్టణం శ్రీరాం నగర్ వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి బింగి రఘువరన్ ఆదివారం సాయంత్రం విష జ్వరంతో మృతి చెందాడు. -8లో

గరిష్టం/కనిష్టం
32.8/24.0

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.0 - 32.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

హోదా మరిచారు!

అధికారిక సమీక్షల్లో సైతం పచ్చ నేతలకు పెద్ద పీట వేస్తుంటే.. విధులు పక్కనబెట్టి 'నిధుల' కోసం పాకులాడుతుంటే.. ఇక 'హోదా' ఏముంటుంది..

నేతలు చెప్పినదానికల్లా తలాడిస్తుంటే... నిత్యం వారి చేతల్లో బందీలయితే.. 'కుర్చీ'ల రగడే జరుగుతుంది..

ప్రజాప్రతినిధులా 'బాధ్యత' లేకుండా ప్రవర్తిస్తున్నారు.. అధికారులా విధి నిర్వహణను మానేశారు.. 'ఇద్దరూ' కలిసి హోదాని.. హుందాతనాన్ని గోదాట్లో కలిపారు.

- రెవెన్యూ తీరు వల్లే కడప ఎమ్మెల్యే కుర్చీ రగడ
- ఏ హోదా లేకున్నా డీఆర్సీ సమావేశాల్లో టీడీపీ నేతలకు పెద్దపీట
- అదే మర్యాద కోసం స్వాతంత్య్ర వేడుకల్లో అధికారులపై చిందులు
- తొలుతే అడ్డుకట్ట వేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేతి కాదు



ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఆహ్వానిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: పంద్రాగస్టు రోజు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, జిల్లా అధికారుల మధ్య తలెత్తిన వివాదం ఇంకా సమసిపోలేదు. ఇరువర్గాలు పరస్పరం విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నాయి. కలెక్టర్ ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదించాలని రెవెన్యూ అధికారులు పట్టుబడుతున్నారు. ఈ మొత్తం వివాదానికి కారణమైన ప్రొటోకాల్ అంశం మరోమారు చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ అధికారులు తొలి నుంచి ప్రొటోకాల్ గాలికి వదిలేసి అధికార టీడీపీ నేతలతో సాగిల పడే ధోరణే ఇంతవరకు తీసుకొచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి ప్రొటోకాల్ లేని టీడీపీ నేతలకు ప్రభుత్వ కార్యక్రమాలు, జిల్లా సమీక్షా కమిటీ లాంటి ముఖ్యమైన సమావేశాల్లో పెద్దపీట వేస్తూ వస్తున్నారు.

ఎమ్మెల్యే భర్తకు ప్రభుత్వ హోదానా!

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి ఎటువంటి ప్రభుత్వ హోదా లేదు. ఆయనేం ప్రజాప్రతినిధి కాదు. అయినా 'ఎమ్మెల్యే భర్త'గా డీఆర్సీ సహా ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో వేదికపై దర్శనమిస్తుంటారు. అంతటితో ఆగకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తుంటారు. ప్రభుత్వ వేదికల నుంచి రాజకీయ విమర్శలు గుప్పించినా కలెక్టర్ సహా ఏ అధికారి అడ్డు చెప్పలేదు. పలుమార్లు ఈ విషయాలు పత్రికల్లో ప్రచురితమైనా అధికారులు స్పందించలేదు. ఇప్పుడు తమవంతు వచ్చేసరికి ప్రొటోకాల్ గురించి మాట్లాడితే దాని విలువ ఏముంటుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి ప్రస్తావన

జిల్లాకు చెందిన ఎద్దుల ఈశ్వర్ రెడ్డి ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, ఓమారు ఎమ్మెల్సీగా, నాలుగు పర్యాయాలు కడప లోక్‌సభ సభ్యునిగా ప్రజలకు విశేష సేవలు అందించిన కమ్యూనిస్టు నాయకుడు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఏదైనా ప్రజా సమస్యలపై కలెక్టర్ వద్దకు వచ్చినపుడు తొలుత చీటీ రాసి పంపించేవారట. 'నేరుగా వెళ్లండి సార్...' అంటూ అధికారులు చెప్పినా సున్నితంగా తిరస్కరించేవారు. కలెక్టర్ అనుమతి వచ్చాకే చాంబర్‌లోకి వెళ్లి సమస్యను విన్నవించేవారు. ఆయన హుందాతనం గురించి ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఉద్యోగులు, నగర పౌరులు చర్చించుకుంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తొలుత ప్రొటోకాల్ క్రమాన్ని తెలుసుకుని హుందాగా ప్రవర్తిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కలెక్టర్ గారూ.. మీరేం చెప్పదలుచుకున్నారు!

స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్, ఎస్పీ మాత్రమే వేదికపై కూర్చోవాల్సి ఉంటుందని రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్‌ను ఊటంకిస్తూ మాట్లాడుతున్నారు. అలాంటపుడు వేదికపై ప్రత్యేకంగా కుర్చీవేసి ఆసీనులు కావాలంటూ ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఆహ్వానించడమంటే నిబంధనలు ఉల్లంఘించడం కాదా? ప్రొటోకాల్ లేదని స్పష్టంగా తెలిసినా డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లే కాకుండా స్వయంగా కలెక్టరే వెళ్లి ఎమ్మెల్యేను వేదికపైకి ఆహ్వానించడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? పైగా ప్రొటోకాల్ విషయంలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తతో, ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలంటూ కలెక్టర్ శ్రీధర్ శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులకు ఉద్బోధించడం ఏమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యే మాధవి రెడ్డి జాయింట్ కలెక్టర్‌పై, ఆమె భర్త శ్రీనివాసులురెడ్డి డీఆర్వోపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినా దిక్కులేదంటే ఇక తమకేదైనా జరిగితే ఎవరు పట్టించుకుంటారని కిందిస్థాయి అధికారులు చర్చించుకుంటున్నారు. ఇలా ఉదాసీనంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉంటుందని వారు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల ఉదాసీనతే కారణం



ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల సందర్భంగా ఏ హోదా లేని టీడీపీ నాయకులు వేదికలను పంచుకున్నారు. ఇందుకు కలెక్టర్ మొదలు ఏ అధికారి అభ్యంతరం చెప్పలేదు. దీంతో తాను ఏం చేసినా చెల్లుతుందనే భావన నాయకుల్లో ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు ప్రొటోకాల్‌ను సమర్థవంతంగా అమలు చేస్తే ఇలాంటివి పునరావృతం కావు.

– కేసీ బాదుల్లా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కడప

అధికారుల వైఖరే కారణం



అధికారులు అధికారులుగా వ్యవహరించాలి. అలా కాకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తితే ఇలాంటి పరిణామాలే ఎదురవుతాయి. తాము ప్రజా సేవకులన్న విషయాన్ని పూర్తిగా మరిచిపోయారు. బాధ్యతగల ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించడం అలవర్చుకోవాలి.

– సీఆర్వీ ప్రసాద్, జిల్లా కన్వీనర్, హేతువాద సంఘం, కడప

దరఖాస్తు చేసుకోండి

రాజంపేట టౌన్: హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారు నిర్వహించే ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారత్, భూషణ్, విద్వాన్ పరీక్షలకు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోతరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. వివరాలకు 6303701314 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

- ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562- 244437 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

వైఎస్ జగన్ పర్యటన ఖరారు!

- 19న ఆకేపాడుకు రాక
- షెడ్యూల్ వివరాలు వెల్లడి



రాజంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న రాజంపేట మండలం ఆకేపాడు రానున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారు అయిందని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి ఆదివారం విలేకర్లకు తెలిపారు.రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆకేపాటి సాయిఅనురాగ్‌రెడ్డి, వరదీక్షితా నవదంపతుల రిసెప్షన్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసి, నవదంపతులను ఆయన ఆశీర్వదించనున్నారన్నారు. ఆకేపాటి ఎస్టేట్‌లో రిసెప్షన్ వేడుక జరగుతుందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి రాజంపేటకు హెలీక్యాప్టర్‌లో వస్తారన్నారు. ఇందుకోస హెలీప్యాడ్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఉదయం పది గంటలకు బయలుదేరుతారన్నారు. తిరిగి ఆకేపాడు ఎస్టేట్ నుంచి 12.35 గంటలకు బయలుదేరి బెంగళూరుకు వెళతారన్నారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న తరుణంలో భారీగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని,, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆకేపాటి అనిల్‌రెడ్డి తెలిపారు.

పర్యటన వివరాలు..

ఉదయం 10గంటలకు బెంగళూరులోని యలహంక నుంచి బయలుదేరుతారు. రోడ్డుమార్గంలో 10.20కి చేరుకుంటారు, 10.30గంటలకు జక్కూరు ఎయిర్‌డ్రోమ్ నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరుతారు. 11.30గంటలకు ఆకేపాడులోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో 11.40గంటలకు ఆకేపాటి ఎస్టేట్‌కు చేరుకుంటారు. 12 గంటల నుంచి 12.15 వరకు ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి తనయుడు రిసెప్షన్ వేడుకల్లో పాల్గొంటారు. 12.25కు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 12.35కు జక్కూరు ఎయిర్‌డ్రోమ్ బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 1.40 గంటలకు బయలుదేరి 2గంటలకు యలహంకలోని రెసిడెన్సీకి చేరుకుంటారు.

జడివాన

- జిల్లా అంతటా వర్షం
- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. సుమారు పది రోజుల నుంచి కురుస్తున్న జడివానకు జనాలు అల్లాడిపోతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించింది. వర్షాలు ఎక్కువై అక్కడక్కడ ఆరుతడి పంటలు ఎర్రగా మారి దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలకు కేసీ కెనాల్ కింద మాత్రం వరినాట్లు సాగు ముమ్మరం అయ్యింది. ఈ వర్షాలు వరిపంటకు మేలే అయినా ఆరుతడి పంటలకు ఇబ్బందికరంగానే ఉందని పలువురు రైతులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి జిల్లాలో లింగాల మండలం మినహా జిల్లాఅంతటా వర్షం కురిసింది. ఎర్రగుంట్లలో అత్యధికంగా 43 మి.మీ వర్షం కురిసింది.



కడప నగరంలో వర్షం పడుతున్న దృశ్యం

పుడమి పరవశం





నల్లని మబ్బు బరువాపుకోలేక చినుకై నేలవాలింది..
నేల తల్లి పచ్చని కోక కట్టి ఎంచక్కా మురిసిపోయింది..
తరువులు తన్మయంగా ఊగిపోతుంటే..
చెరువులు గలగలల సరాగాల్లో 'మునిగి' తేలుతుంటే..
తెల్లని మేఘమొకటి కొండచాటుగా ఆ అందాన్ని చూసి తరిచింది..
జడిపట్టిన వానకు కొండాకోన తడిసిముద్దయ్యాయి. నదీ పరీవాహక ప్రాంతాలు ఇదిగో ఇలా పచ్చగా కనువిందు చేస్తున్నాయి. ఆదివారం కడప– సిద్దవటం మార్గంలోని మాచుపల్లె వద్ద కనిపించిన ప్రకృతి దృశ్యమిది.

↑ ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్నా

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబసమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. గొల్లపల్లెకు చెందిన నరసింహులు భార్య అమ్ములు(40) భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంటి వద్దే మాత్రలు మింగింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

దివ్యాంగులకు అన్యాయం



అఫ్జల్ సదరం సర్టిఫికెట్‌లో అమ్మాయి ఫొటో ఉన్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్ : నిజమైన దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్ల మంజూరులో అన్యాయం చేస్తున్నారని దివ్యాంగుడు దొడియం అఫ్జల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనకు చిన్న తనంలోనే పోలియో సోకి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయన్నారు. గతంలో మెడికల్ సర్టిఫికెట్‌లో తనకు 90 శాతం వికలత్వం ఉందని ఇచ్చారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన రీవెరిఫికేషన్ సర్టిఫికెట్‌లో తనకు కేవలం 64 శాతం వికలత్వం ఉందని ఇచ్చారన్నారు. తన ఫొటోకు బదులు అమ్మాయి ఫొటోను తప్పుగా నమోదు చేశారన్నారు.

మహిళ ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో అక్కాయపల్లిలో శాస్త్రినగర్‌లో నివాసముంటున్న సుభాన్‌బీ, తనను భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఆదివారం ఆమె భర్త బోదెన చిన్న, మామ చిన్న సిద్ధయ్యను అరెస్ట్ చేసి, మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా వారిని రిమాండ్‌కు తరలించినట్లు కడప తాలూకా సీఐ రెడ్డెప్ప తెలిపారు.

వైద్య ప్రముఖుడు డాక్టర్ వైబీ రెడ్డి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర ప్రముఖుడు, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన డాక్టర్ వైబీ రెడ్డి బెంగళూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వైబీ రెడ్డి వైద్య విద్యను పూర్తి చేసి కడపలోని ఏడురోడ్లలో దాదాపు 15 సంవత్సరాలు ప్రజలకు వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రానైట్ మైన్స్ ఓనర్‌గా విశేష ఖ్యాతి ఆర్జించగా, ఫాదర్ ఆఫ్ కడప మార్బుల్స్ అని బిరుదును దక్కించుకున్నారు. సిద్ధవటం మండలం భాకరాపేటకు చెందిన ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తె కుటుంబం అమెరికాలో ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. చిన్న కుమార్తె కుటుంబం బెంగళూరులో ఉంటున్నారు.

రామాలయంలో చోరీ

గాలివీడు : మండల పరిధిలోని నూలివీడు గ్రామం బోడసానివాండ్లపల్లెలో నూతనంగా ప్రారంభించిన రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ. 50 వేలు విలువ కలిగిన వెండి ఆభరణాలను దొంగిలించారు. స్థానికులు ఆదివారం ఆలయానికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సిబ్బంది ముగ్గురు.. ఖైదీలు ఐదుగురు

- సబ్‌జైలులో స్పష్టంగా కనిపిస్తున్న భద్రతాలోపం
- ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు ?



ప్రొద్దుటూరు సబ్‌జైలు

ప్రొద్దుటూరు క్రైం : సిబ్బంది ముగ్గురు.. ఖైదీలు ఆరుగురు. ఇది సినిమా టైటిల్ కాదు. ప్రొద్దుటూరు సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలు, విధుల్లో ఉన్న సిబ్బంది సంఖ్య. సబ్‌జైల్లో వివిధ కేసులకు సంబంధించి ఐదుగురు రిమాండు ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నారు. ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉన్నా ఐదుగురిలో ఒక ఖైదీ గోడ దూకి పారిపోయాడు. దీనిపై అనేక విమర్శలు వస్తున్నాయి. సబ్‌జైల్లో ఉన్న రిమాండు ఖైదీ మహ్మద్‌రఫీ శనివారం ఉదయం జైలు గోడ దూకి పారిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో జైల్లో భద్రతా లోపాలు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా తక్కువ మంది ఖైదీలు ఉన్నప్పుడు వారిపై నిఘా ఎక్కువగా ఉంటుంది. అయితే ఇక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 20 అడుగులు మేర ఉన్న గోడ దూకి దొంగ చాకచక్యంగా తప్పించుకున్నాడు. ముఖ్యంగా గోడ చుట్టూ విద్యుత్ తీగలు కూడా ఉన్నాయి. వీటి గుండా దొంగ తప్పించుకొని వెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలలో స్పష్టంగా కనిపిస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. అయితే విద్యుత్ తీగలను తగలకుండా అతను తప్పించుకొని వెళ్లే విధానాన్ని చూసి పోలీసు అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఖైదీ గత నేరచరిత్రను ఉన్నతాధికారులకు చెప్పని సిబ్బంది ..

నిందితులను అరెస్ట్ చేసిన అనంతరం కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు వారిని స్థానికంగా ఉన్న సబ్‌జైలుకు తరలిస్తారు. జైలుకు తరలించిన తర్వాత అతను పాత నేరస్తుడైతే పోలీసులు ఈ విషయాన్ని జైలు అధికారులకు తెలియజేస్తారు. లేదా రిమాండు రిపోర్టు ఆధారంగా వారి నేర చరిత్రను జైలు అధికారులు తెలుసుకుంటారు. వారిపై ఉన్న కేసుల ఆధారంగా కోర్టు సూచనతో సబ్‌జైల్లో ఉంచాలా లేక జిల్లా కేంద్రానికి తరలించాలా అనేది ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు. రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామంలో పట్టపగలే చోరీ చేస్తూ పట్టుబడిన మహమ్మద్‌రఫీని ఈ నెల 13న రాజుపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండు నిమిత్తం ప్రొద్దుటూరు సబ్‌జైలుకు తరలించారు. ఇతను అనేక జిల్లాల్లో చోరీలు చేశాడు. నిందితుడిపై 25కు పైగా కేసులు ఉన్నాయి. టంగుటూరు గ్రామంలో చోరీ చేస్తున్న సమయంలో అడ్డు వచ్చిన ఇంటి యజమానిపై మహమ్మద్‌రఫీ దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కరుడుగట్టిన నేరస్తుడైన అతని గత నేర చరిత్ర గురించి పోలీసులు సబ్‌జైలు అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే మహమ్మద్‌రఫీపై ఉన్న పాత కేసుల గురించి ఇక్కడి సిబ్బంది జిల్లా జైళ్లశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని విశ్వసనీయ సమాచారం. కాగా ప్రొద్దుటూరు సబ్‌జైలు నుంచి పారిపోయిన రిమాండు ఖైదీ మహమ్మద్‌రఫీ కోసం త్రీ టౌన్ పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా అతని జాడ కోసం అన్వేషిస్తున్నారు.

నేడో రేపో సస్పెన్షన్ ఉత్తర్వులు?

రిమాండు ఖైదీ తప్పించుకున్న ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. రిమాండులో ఐదుగురు మాత్రమే ఖైదీలు ఉన్నా సరైన పర్యవేక్షణ చేయలేదని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఖైదీ పారిపోయిన ఘటనపై జిల్లా సబ్‌జైళ్ల అధికారి అమర్‌బాషా విచారణ చేసి పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో పాటు మరో ఇద్దరిపై వేటు పడే అవకాశం ఉంది. శాఖాపరమైన చర్యలకు సంబంధించిన ఆదేశాలు నేడో, రేపో వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా 2021లో జమ్మలమడుగు సబ్‌జైలు నుంచి మహమ్మద్‌రఫీ తప్పించుకొని పోలేదని, అతనికి బెయిల్ రావడంతో జైలు నుంచి విడుదల చేసినట్లు జిల్లా సబ్ జైళ్ల అధికారి అమర్‌బాషా తెలిపారు.

సౌదీ అరేబియాలో కుమార్లకాల్వ వాసి మృతి



షేక్ నూర్‌బాషా(ఫైల్)

చక్రాయపేట : జీవనోపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన చక్రాయపేట మండలం కుమార్లకాల్వకు చెందిన షేక్ నూర్‌బాషా(38) మృతి చెందాడు. ఆదివారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12–30 గంటలకు మృతి చెందినట్లు అక్కడ ఉన్న అతని మిత్రులు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించి నూర్‌బాషా బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఇతను బతుకు దెరువు నిమిత్తం 15 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియాలోని దమామ్‌కు వెళ్లాడు. ఐదు నెలల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చి భార్యా బిడ్డలు, బంధుమిత్రులతో హాయిగా గడిపి తిరిగి దమామ్ వెళ్లాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్ రూమ్‌లోకి వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. బాత్‌రూం నుంచి ఎంత సేపటికి రాక పోవడంతో మిత్రులు వెళ్లి చూడగా కింద పడి మృతిచెంది ఉన్నాడు. ఈ విషయాన్ని నూర్‌బాషా మిత్రులు కుమార్లకాల్వలోని కుటుంబీకులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. విషయం తెలియగానే వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య గౌసియా, ఆర్షియా, రియాజ్, రిజ్వాన్ అనే 10 సంవత్సరాల లోపు పిల్లలు, వృద్ధురాలైన తల్లి ఉన్నారు. మృతదేహాన్ని కుమార్ల కాల్వకు రప్పించేందుకు కృషి చేయాలని అధికార పార్టీ నేతలను కోరినట్లు మృతుడి బంధువు మిఠాయిగిరి కరీముల్లా తెలిపారు.

ఓసీలకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి



నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి

కలసపాడు : ఓసీలకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లెలో అయన మాట్లాడుతూ ఓసీ జాబితాలో ఉన్న రెడ్లు, బ్రాహ్మణులు, కమ్మ, బలిజ, ఆర్యవైశ్య తదితర ఎన్నో కులాల్లో నిరుపేదలైన వారు ఉన్నారన్నారు. వారికి సరైన ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 10 ఎకరాల లోపు భూమి ఉన్న వారికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని సూచించిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైన ఓసీలకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను మంజూరు చేసి విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రెడ్డి సంఘం నాయకులు అమ్మిరెడ్డి వెంకటనాగిరెడ్డి, ఎర్రగుంట్ల నాగమోహన్‌రెడ్డి, తుమ్మల కొండారెడ్డి, గువ్వల వెంకట సుబ్బారెడ్డి, పోలక సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన జగదీష్

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కేశలింగాయపల్లెకు సమీపంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా తవ్విన కల్వర్టు గుంతలో పడి స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన గుగ్గిళ్ల జగదీష్ (18) అనే యువకుడు మృతి చెందాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ సంఘటన గురించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఏడుగురు 20 ఏళ్లలోపు యువకులు మండలంలోని గంజికుంటలో ఓ వివాహ వేడుక సందర్భంగా డీజే ఏర్పాటు చేసినట్టు తెలుసుకున్నారు. శనివారం రాత్రి కాలనీ నుంచి రెండ బైకుల్లో గంజికుంటకు వెళ్లారు. రాత్రి 12 గంటల తర్వాత గంజికుంట నుంచి వారు తిరిగి వస్తుండగా కేశలింగాయపల్లె సమీపంలో మైదుకూరు – తాడిచర్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తవ్విన కల్వర్టు గుంతలో నలుగురు ప్రయాణిస్తున్న బైక్ పడిపోయింది. బైక్‌పై ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా జగదీష్ తలకు తీవ్ర గాయమైంది. అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. సంఘటనపై మృతుడి తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రవక్త జీవితంపై రాత పోటీ పరీక్షలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపైన సెప్టెంబర్ 21వ తేదీన రాత పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నామని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్ తెలిపారు. ఆదివారం కడప నగరంలోని అప్సర్ కాలనీలో ఉన్న కార్యాలయంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వ కారుణ్యమూర్తి ప్రవక్త మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం) వారి జీవిత చరిత్రపై నిర్వహించే రాత పరీక్ష పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో రాత పరీక్ష పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ కోసం http://Seerat.ciwskadapa.org/ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్ బాబు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరం శంకరాపురంలో అంధుల పాఠశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను హైదరాబాద్‌కు చెందిన ఏఐజీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, పద్మ విభూషణ్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేసిన డాక్టర్ జి. రితేష్‌రెడ్డి, డాక్టర్ శ్రావ్యారెడ్డిలకు అభినందనలు తెలిపారు. ఇక్కడ 24 గంటలు అందుబాటులో ఉండే వైద్య సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. మాధవరెడ్డి, డాక్టర్ శ్రీదేవి, కాంట్రాక్టర్ ఎం.నాగసుబ్బారెడ్డి, ఎం. మునిరెడ్డి, పలువురు వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.


బ్రౌన్ గ్రంథాలయానికి బీరువా, పుస్తకాల బహూకరణ

కడప ఎడ్యుకేషన్ : తప్పెట్ల కొత్తపల్లికి చెందిన దివంగత మల్లిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం బీరువాను, ఆయన వ్యక్తిగత గ్రంథాలయంలోని వంద పుస్తకాలను ఆయన కుమారుడు, పెన్నా సిమెంట్స్ విశ్రాంత జనరల్ మేనేజర్ మల్లిరెడ్డి సుబ్బారెడ్డి ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి బహూకరించారు. సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ వాటిని స్వీకరించారు. పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన విలువైన గ్రంథాల్లో విష్ణు పురాణం, వామన పురాణం, శ్రీమద్భాగవతం (వ్యాసుడు), ఆంధ్ర మహాభారతం, పోతన భాగవతం, శివరాత్రి మాహాత్మ్యం, శ్రీమద్భగవద్గీత, ఆంధ్రవాల్మీకి రామాయణం, కాశికాంబా సప్తశతి తదితర పుస్తకాలు ఉన్నాయన్నారు.

అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ

మదనపల్లె రూరల్ : పశ్చిమబెంగాల్‌వాసి అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు రైల్వే సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం పశ్చిమబెంగాల్‌వాసి ఖదీర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఉపాధి కోసం పశ్చిమబెంగాల్ ముర్షీదాబాద్ ఇమామ్‌నగర్‌కు చెందిన ఎస్.కే.మైముల్ కుమారుడు ఎస్.కే.ఖదీర్(30) మదనపల్లెకు వచ్చి రోడ్డు, భవననిర్మాణ పనులు చేస్తూ కురబలకోట మండలం రైల్వేబ్రిడ్జి సమీపంలో షెడ్ నిర్మించుకుని మరో ఇద్దరితో కలిసి ఉంటున్నాడు. నెలరోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చాడు. ఈనెల 15 శుక్రవారం తనకు పరిచయస్తుడైన ఆటోడ్రైవర్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లాడు. శనివారం మదనపల్లె మండలం సీటీఎం రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో శవమై కనిపించాడు. ఆటోడ్రైవర్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. అన్ని కోణాల్లోనూ కేసు విచారిస్తున్నామన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు.

ఇంటిలో చోరీ



అల్మారాలోని నగదు, బంగారు నగలు అపహరించాక తెరిచి ఉన్న దృశ్యం

గాలివీడు : మండల కేంద్రమైన గాలివీడులోని గౌతమ్ స్కూలు సమీపంలో శనివారం రాత్రి ఓ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బీగాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆటో డ్రైవర్ ఎం.మల్లయ్య శనివారం తన అత్తగారింటికి వెళ్లడంతో గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి అల్మారాలో ఉన్న రూ. 3 లక్షల నగదు, 12 తులాల బంగారు నగలను అపహరించినట్లు బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. దొంగతనం చేసిన నగదు, బంగారు ఆభరణాల రశీదుల వివరాలను స్టేషన్‌లో సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలు ఊర్లకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు ఇళ్లలో పెట్టరాదని, బ్యాంకు లాకర్‌లో భద్ర పరుచుకోవాలన్నారు. అలాగే ఊర్లకు వెళ్లే సమయంలో సమాచారం పోలీసు స్టేషన్‌లో తెలియజేస్తే ఆ ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రస్తుతం జరిగిన సంఘటనపై పూర్తి విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసపోతున్న యువత

కడప అర్బన్ : మయన్మార్‌లో ఉద్యోగాల పేరుతో కడప వాసులు ఇబ్బుదులు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను ఇప్పిస్తామని కొందరు ఏజెంట్ల ద్వారా ఆకర్షింపచేశారు. వారిని తమ ఫేక్ కంపెనీలో కాల్ సెంటర్ నుంచి మహిళల వాయిస్‌తో వినియోగదారులతో మాట్లాడించి వారి వలలో పడేలా చేసుకుంటారు. ఈ విధంగా మోసం చేసేందుకు అక్కడికి వచ్చిన యువతను ఉపయోగిస్తుంటారు. సైబర్ నేరాలకు మయన్మార్ అడ్డాగా మారింది. వీరితో ఏఐ (అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్‌తో వాట్సప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా లింకులు పంపిస్తారు. మన అకౌంటులోని డబ్బులు లాగేస్తారు. ఇలాంటి బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన సునీల్ అనే యువకుడు తెలంగాణకు చెందిన రాజశేఖర్ కలిసి డేటా ఎంట్రీ ఆపరేటరు ఉద్యోగం పేరుతో లక్ష రూపాయలు జీతం వస్తుందనే ఆశతో థాయిలాండ్ వెళ్లి, అక్కడ నుండి మయన్మార్ దేశానికి వెళ్లాడు. అక్కడ ఓ కార్యాలయంలో వీరిని పెట్టి, రకరకాల దేశాల్లో ఉన్న తెలుగు వారికి వీరి ద్వారా మెసేజ్‌లు పెట్టిస్తారు. వారి వద్ద ఉన్న అకౌంట్ల ద్వారా డబ్బులు వేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే కొంత మంది ఈ స్కాం నిరాకరించడంతో ఆ దేశస్తులు వీరిని చిత్రహింసలకు గురి చేస్తున్నట్లు బాధితుడు సునీల్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను అనుభవిస్తున్న వేధింపులు కుటుంబ సభ్యులకు చెప్పడంతో దాదాపు రూ.7లక్షల వరకు వారికి చెల్లించడంతో స్వగ్రామం కడపకు వచ్చి తన అనుభవాన్ని వెల్లడించాడు. బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఈ ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వారి ద్వారా ఈ ముఠాను గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ విషయంపై సైబర్ పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, తమ దృష్టికి వస్తే కచ్చితంగా బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని, లేనిపక్షంలో బ్రహ్మంగారిపేరుతో ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బద్వేలు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలోకి చేర్పుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ న్యాయవాది దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, బీసీ సంఘం నాయకుడు బి.సి.రమణ మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చడం వలన నియోజకవర్గ ప్రజలు అనేక రకాల వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుందని అన్నారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన బద్వేలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిందిపోయి వేరొక జిల్లాలోకి మార్చడం తగదన్నారు. బద్వేలు నియోజకవర్గ ప్రజల మనోభావాలను గుర్తించి బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని, అలా కుదరని పక్షంలో బద్వేలు నియోజకవర్గంతో పాటు గిద్దలూరు వరకు ఉన్న గ్రామాలు, ఆత్మకూరు సమీపంలోని ఉదయగిరి వరకు ఉన్న గ్రామాలతో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పేరుతో ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో బద్వేలు పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకుడు పిచ్చయ్య, సీనియర్ దళిత నాయకుడు ఓ.ఎస్.వి. ప్రసాద్, బలిజ సంఘం నాయకుడు కిరణ్, బీజేపీ నాయకుడు వెంకటసుబ్బయ్య, బీఎస్పీ నాయకుడు గౌస్‌పీర్, కవి ఇరుపోతు శ్రీనివాసవర్మ, సోమశిల వెనుకజలాల సాధన సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు సి.రామచంద్రారెడ్డి, ఆవులవెంకట్, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల అసోసియేషన్ నాయకులు నాగేశ్వర్ రావు, చంద్రఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని వైఎస్సార్ కడప జిల్లా డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్ కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ కోసం ఈ నెల 25వ తేదీ విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం కడప ఎన్‌జీఓ భవన్‌లో ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి శివారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఏపీటీఎఫ్–1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నరసింహారావు, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నాయకుడు సజ్జల రమణారెడ్డి, ఏపీటీఎఫ్ 257 జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి, ఆపస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కన్వీనర్లు ఉదయ భాస్కర్, వీరప్రతాప్, శోభారాణి తదితరులు మాట్లాడారు. ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జల తిరుపాల్,సుధాకర్, ప్రవీణ్‌కిరణ్, నాగేశ్వరెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల ఆదరణ చూపాలి


ఏపీయూడబ్ల్యూజే నాయకులు



మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకుడు రామసుబ్బారెడ్డి, చిత్రంలో బాలకృష్ణారెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ఆదరణ చూపుతూ వారికి తమవంతుగా తోడ్పాటు అందించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం. బాలకష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.వెంకటరెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డిలు సూచించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని జడ్పీ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు పోరాటం చేసే యూనియన్‌గా కొనసాగుతున్న ఏపీయూడబ్ల్యూజే వద్ధుల సమక్షంలో వ్యవస్థాపక దినాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులే మన జీవితానికి పునాది వేశారని, మన బాల్యంలో తల్లిదండ్రులు చూపిన ప్రేమను తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధులను మనం ఆదరించడం ద్వారా చిన్నపిల్లలకు కూడా మానవత్వపు విలువలు తెలియజేసిన వారమవుతామన్నారు. ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, పాత్రికేయలు శివరాం, ఆంజనేయులు, శ్రీనివాసులు, పెన్నేరు శర్మ, మౌలా, నాగరాజు, సర్దార్, వీర నారాయణ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరంతో విద్యార్థి మృతి



రఘువరన్ (ఫైల్)



విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు

వేంపల్లె : వేంపల్లె పట్టణం శ్రీరాం నగర్ వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి బింగి రఘువరన్ ఆదివారం సాయంత్రం విష జ్వరంతో మృతి చెందాడు. కళాశాల రోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న బింగి ఓబులేసు, భారతిలకు ఇద్దరు పిల్లలు ఉండగా, రఘువరన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం విద్యార్థికి జ్వరం రావడంతో వేంపల్లెలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చూపించినట్లు తండ్రి ఓబులేసు తెలిపారు. రఘువరన్‌కు జ్వరం తగ్గకపోవడంతో కడప రిమ్స్‌కు తరలించి చికిత్స చేసి మెదడుకు జ్వరం సోకినట్లు వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్, రుయాకు తీసుకెళ్లారు. అయితే స్విమ్స్, రూయాలో బెడ్లు లేకపోవడంతో తిరిగి కడప రిమ్స్‌కు తీసుకొచ్చి రఘువరన్‌కు చికిత్స చేయించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





గాయపడిన నజీర్‌ఖాన్, అమరనాథ్

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన ఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ నేతాజీకాలనీకి చెందిన నజీర్‌ఖాన్ (40) రైల్వేక్వార్టర్స్‌కు చెందిన అమరనాథ్ (38) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చారు. తిరిగి రాత్రి సీటీఎంకు వెళుతుండగా మార్గమధ్యలో శానిటోరియం వద్ద వేగంగా వెళ్లి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొని, పక్కనే వస్తున్న కారుపై పడ్డారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితులను తిరుపతికి రెఫర్ చేశారు.